
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

జనగామ

మంగళవారం 20 ఆగస్టు 2024

వలస కూలీలకు ఈకేవైసీ



హనుమకొండ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : పొట్ట కూటి కోసం ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చి స్థిర పడి తెల్లరేషన్ కార్డు కలిగిన వారు ఇకపై తప్పని సరిగా ఈకేవైసీ చేయించుకోవలసిందే. ఈ మేరకు వలస కూలీలకు అవకాశం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉన్న వలస కూలీలకు కొంత ఊరట లభించనుంది. ఆహార భద్రత కార్డు (తెల్ల రేషన్ కార్డు) కలిగిన వారంతా.. ఆ కార్డులో సభ్యులుగా పేర్లు నమోదైన వారు ఈకేవైసీ చేసుకునే ప్రక్రియ గతేడాది సెప్టెంబరు నుంచి ప్రారంభమై ఈ ఏడాది ఫిబ్రవరిలో ముగిసింది. ఉమ్మడి జిల్లాలో 90శాతానికిపైగా పూర్తయింది. అయితే ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వలస కూలీలు ఈకేవైసీ చేసుకోలేదు. కూలీ పనులపై వారంతా ఎక్కడెక్కడెక్కడికో వెళ్లడం, పైగా ఈకేవైసీ గురించిన అవగాహన వారికి లేకపోవడంతో వారు ఈ ప్రక్రియకు దూరంగా ఉన్నారు. ఇప్పుడు వారంతా చేసుకోవలసి ఉంటుంది. ఆహార భద్రత కార్డులో పేరున్న సభ్యులు స్థానికంగా ఉన్నారా? లేదా ఎక్కడికైనా వెళ్లిపోయారా? అని తెలుసుకునేందుకు ఈకేవైసీ ప్రక్రియ నిర్ణయాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకుంది. వలస కూలీలు కాకుండా ఇతరులు రేషన్ దుకాణాల్లో డీలర్ వద్ద బయోమెట్రిక్ విధానంతో ఈకేవైసీ చేయించుకున్నారు.

తప్పనిసరి

ఉత్తర్ ప్రదేశ్, బిహార్, జార్ఖండ్, మధ్య ప్రదేశ్, మహారాష్ట్రతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలు ఉమ్మడి జిల్లాలో లక్ష మందికిపైగా ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో వివిధ పనులు చేసుకుంటూ పొట్టపోసుకుంటున్నారు. వారికి సంబంధించిన ఆధార్ కార్డు, రేషన్ కార్డు, వారి స్వరాష్ట్రాలకు చెందిన చిరునామాలు తాము పని చేస్తున్న ప్రాంతాల్లోని రేషన్ దుకాణాల డీలర్ల వద్ద తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి. ఇలాంటి అవకాశం గతంలో ఇవ్వలేదు. రేషన్ దుకాణంలో డీలర్లు ప్రత్యేక పోర్టల్‌లో కూలీల వివరాలు నమోదు చేస్తారు. కార్డులో పేరున్న సభ్యుడి వేలిముద్రలు రాకుండే ఐరీస్ ద్వారా ప్రక్రియను పూర్తి చేస్తారు. ఇది వరకు రాష్ట్రంలో ఉండేవారికి మాత్రమే ఈకేవైసీ చేశారు. ప్రస్తుతం దేశంలో ఎక్కడైనా రేషన్ సరుకులు పొందే వీలుంది. ఈ తరుణంలో వలస కూలీలకు దేశంలో ఏ రాష్ట్రంలో ఉన్నా ఈకేవైసీ తప్పని సరిగా మారింది. అధికారిక ఉత్తర్వులు రాగానే ఈ ప్రక్రియను పౌరసరఫరాల శాఖ అధికారులు ప్రారంభిస్తారు. ఈ మేరకు ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను అన్ని రేషన్‌షాపుల డీలర్లకు అందజేశారు.



పెరుగుతున్న వలస కూలీలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో గ్రూపు మేస్త్రీలు, గుంపు మేస్త్రీలతో భారీ, మధ్య తరహా నిర్మాణ కాంట్రాక్టర్లు ఒప్పందాలు కుదుర్చుకొని అవసరమైనంత మంది కూలీలను పొరుగు రాష్ట్రాల నుంచి రప్పించి పనిలో పెడుతుండడంతో ఉమ్మడి జిల్లాలో వలస కూలీల సంఖ్య అంతకంతకు పెరుగుతోంది. ఏ కాంట్రాక్టర్ సహాయం లేకుండానే పని వెతుక్కుంటూ స్వచ్ఛందగా వస్తున్న వలస కూలీలు కూడా ఉన్నారు. వీరి సంఖ్య కూడా గణనీయంగా ఉన్నది. వీరంతా ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వం, ప్రైవేటు సంస్థలు చేపట్టే భారీ నిర్మాణాలు, ప్రాజెక్టులు, కాలువలు, విద్యుత్ స్తంభాలను పాతడం లాంటి పనుల్లో పాలుపంచుకుంటున్నారు.

లక్ష మందికిపైగా వలస కూలీలు

ఉమ్మడి జిల్లాలో లక్ష మందికిపైగా వలస కూలీలు ఉన్నట్లు అంచనా. హనుమకొండ జిల్లాలో అత్యధికంగా 30వేల మంది ఉన్నారని, వరంగల్ జిల్లాలో 25వేలు, జనగామ జిల్లాలో 20వేలు, మహబూబాబాద్ జిల్లాలో 10వేలు, ములుగు జిల్లాలో 7వేలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 8వేల మంది వలస కూలీలున్నట్లు కొవిడ్ సమయంలో నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. కొవిడ్ అనంతరం పరిస్థితులు చక్కబడిన తర్వాత ఈ వలస కూలీల సంఖ్య మరింత పెరిగినట్లు తెలుస్తోంది. వలస కూలీలు భవన నిర్మాణ పనుల్లోనూ ఎక్కువగా ఉన్నారు. బిల్డర్లు ఇతర రాష్ట్రాల నుంచి కూలీలను తప్పించుకోవడం ద్వారా పనులు చేయించుకుంటున్నారు. స్థానిక కూలీల కన్నా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వలస కూలీలతో పెద్దగా ఇబ్బందులు ఉండకపోవడమే ఇందుకు కారణంగా చెబుతున్నారు.

రేషన్ దుకాణాలు, కార్డులు

ఉమ్మడి జిల్లాలో మొత్తం 2313 రేషన్ దుకాణాలు ఉండగా అన్నపూర్ణకార్డులు (ఏఏపీ), అంత్యోదయ అన్నయోజన కార్డులు (ఏఏవై), ఆహార భద్రతా కార్డులు (ఎఫ్ఎస్‌సీ) కలుపుకొని మొత్తం 11,11,401 రేషన్ కార్డులున్నాయి.



జిల్లా	రేషన్ దుకాణాలు	మొత్తం కార్డులు
భూపాలపల్లి	277	1,23,559
మహబూబాబాద్	556	2,40,370
వరంగల్	509	2,66,676
హనుమకొండ	414	2,28,144
ములుగు	222	91,505
జనగామ	335	1,61,147

- త్వరలో ప్రక్రియ ప్రారంభానికి రాష్ట్ర ప్రభుత్వ చర్యలు
- తెల్ల రేషన్ కార్డు కలిగి ఉన్న వారికి ఊరట
- ఉమ్మడి జిల్లాలో లక్ష మందికిపైగా వలస కూలీలు
- వన్ నేషన్, వన్ కార్డు విధానంతో వెసులుబాటు

జిల్లాలో మోస్తరు వర్షం

తరిగొప్పులలో అత్యధికంగా 67.3 మి.మీ నమోదు



జిల్లాకేంద్రంలోని హైదరాబాద్ రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

జనగామ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. ఒకటి రెండు చోట్ల భారీ వర్షం కురియగా, పలు చోట్ల మోస్తరు వర్షం పడింది. చాలా రోజుల తర్వాత మోస్తరు వర్షంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వానాకాలం సీజన్ ప్రారంభంలో జిల్లాలో మోస్తరు వానలు పడగా గత నెల రోజులుగా పెద్ద వర్షాలేవీ పడలేదు. దీంతో పత్తి, ఇతర ఆరుతడి పంటలు సాగు చేసిన అన్నదాతలు ఆందోళన చెందారు. తాజాగా ఆదివారం రాత్రి, సోమవారం సాయంత్రం మోస్తరు వానలు పడడంతో ఆరుతడి పంటలకు జీవం పోసినట్లయింది. జిల్లా వ్యాప్తంగా సోమవారం 22.3 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. జిల్లాలో అత్యధికంగా తరిగొప్పులలో 67.3 మి.మీ వర్షం పడగా, అత్యల్పంగా బచ్చన్నపేటలో 1 మి.మీ వర్షం పడింది. అదేవిధంగా బచ్చన్నపేట మండలం పడమటికేశవాపూర్‌లో 58.5 మి.మీ, తరిగొప్పుల మండలం అబ్దుల్‌నాగారంలో 46 మి.మీ, లింగాలఘనపురంలో 42.8 మి.మీ, నర్మెటలో 38.3 మి.మీ, జనగామలో 32.5 మి.మీ, స్టేషన్‌ఘన్‌పూర్‌లో 32.5 మి.మీ, జఫర్‌గడ్‌లో 29 మి.మీ, పాలకుర్తి మండలం గూడూరులో 24.3 మి.మీ, స్టేషన్ ఘన్‌పూర్ మండలం తాటికొండలో 18.8 మి.మీ, జఫర్‌గడ్ మండలం కూనూరులో 18.8 మి.మీ, రఘునాథపల్లిలో 16.3 మి.మీ, జనగామ మండలం వడ్లకొండలో 12.5 మి.మీ, దేవరుప్పుల మండలం కోలుకొండలో 7 మి.మీ వర్షం పడింది.

నేడు ముగ్గురు మంత్రుల రాక

భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో పర్యటన

పర్యాటక కేంద్రాలు, చారిత్రాక ప్రదేశాలు, దేవాలయాల సందర్శన

పలు అభివృద్ధి పనుల పరిశీలన





ములుగు/రేగొండ, ఆగస్టు 19: భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మంగళవారం పర్యటించనున్నారు. భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం కొడవటంచలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని ఉదయం 9.30 గంటలకు సందర్శిస్తారు. ఉదయం 10.30 గంటలకు కొత్తపల్లిగోరి మండలంలోని జగ్గయ్యపేట గ్రామం మీదుగా పాండవుల గుట్టలకు చేరుకొని పరిశీలిస్తారు. మధ్యాహ్నం 12.30 గంటలకు గణపురం మండలం మైలారంలోని గుహలు, గణపసముద్రం చెరువును పరిశీలించి వాటి అభివృద్ధిపై చర్చిస్తారు. 2.15 గంటలకు కోటగుళ్లను సందర్శిస్తారు. అక్కడి నుంచి ములుగు జిల్లాకు బయల్దేరుతారు. వెంకటాపూర్‌లోని రామప్ప దేవాలయాన్ని మధ్యాహ్నం 2.30 గంటలకు సందర్శిస్తారు. సాయంత్రం 4 గంటలకు గోవిందరావుపేట మండలం లక్నవరం చెరువును పరిశీలిస్తారు. 5.40 గంటలకు తాడ్వాయి మండలంలోని మేడారం సమ్మక్క, సారలమ్మలను దర్శించుకుంటారు. పర్యాటక, దేవాదాయ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలిస్తారు. రాత్రి 7 గంటల వరకు మంత్రుల పర్యటన ములుగు జిల్లాలో కొనసాగనుంది.

కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలి

- రైల్వే పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి
- కాజీపేట రైల్వే ఆస్పత్రిని ఆధునికీకరించాలి
- నష్కల్-హసన్‌పర్తి, నష్కల్-చింతలపల్లి రైల్వేలైన్ వల్ల రైతులకు తీవ్ర నష్టం
- దక్షిణమధ్య రైల్వే జీఎంను కోరిన ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే శ్రీహరి

7లో



వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే శ్రీహరి

ఆత్మీయానుబంధాల రాఖీ

» జిల్లా వ్యాప్తంగా రక్షాబంధన సంబురం » ఆడపడుచుల రాకతో సందడి » రద్దీగా స్వీట్ షాపులు, బస్టాండు

జనగామ కల్చరల్, ఆగస్టు 19: రాఖీ పర్వదినాన్ని సోమవారం జిల్లా వ్యాప్తంగా వైభవంగా జరుపుకున్నారు. జనగామ జిల్లా కేంద్రంలో అన్నాచెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల ప్రేమానురాగాల మధ్య రక్షాబంధన్ వేడుకలను నిర్వహించుకున్నారు. జిల్లా వ్యాప్తంగా తరలివచ్చిన తోబుట్టువులతో ఇళ్లల్లో సందడి నెలకొంది. అన్నా నాకు నీవు రక్ష, నీకు నేను రక్ష అన్న భావనతో సోదరులకు సోదరీమణులు రాఖీలు కట్టి మిఠాయి తినిపించారు. స్వీట్లు, రాఖీల కొనుగోళ్లతో దుకాణాలు సందడిగా మారాయి.

వేడుకల్లో కలెక్టర్, అదనపు కలెక్టర్లు

రాఖీ పర్వదిన వేడుకల్లో జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్లు పింకేశ్‌కుమార్, రోహిత్‌సింగ్ పాల్గొని మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. మహిళా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలసదనం ఆశ్రమంలోని విద్యార్థులు కలెక్టరేట్‌లో కలెక్టర్, అదనపు కలెక్టర్లకు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆడబిడ్డల రక్షణకు ప్రతీకగా రాఖీ వేడుకలు నిర్వహిస్తారన్నారు. నిండు నూరేళ్ల మహిళల పట్ల బాధ్యతగా ఉంటానని, కలకాలం మీరు సుఖశాంతులతో ఉండాలన్నారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, ఆర్డీవోలు కొమురయ్య, వెంకన్న, డీడబ్ల్యూవో జె.జయంతి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఎల్.రవికాంత్, బాలసదనం సూపరింటెండెంట్ వెరోనిక, వివిధ శాఖల జిల్లా అధికారులు, హోమ్ సిబ్బంది, పిల్లలు పాల్గొన్నారు.

ఘనంగా సంతోషిమాత జన్మదినం

రాఖీ పౌర్ణమి సంతోషిమాత అమ్మవారి జన్మదినం కావడంతో జిల్లా కేంద్రంలోని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక సంతోషిమాత దేవాలయం, విజయదుర్గామాత దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సంతోషిమాత, ఆంజనేయస్వామి దేవాలయంలో అమ్మవారి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి సుప్రభాత సేవ, క్షీరాభిషేకం, రక్షా బంధనము తదుపరి తీర్థప్రసాద వితరణ మొదలగు కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు పార్నంది శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. హనుమత్ రామనాథ సహిత శ్రీరామచంద్ర స్వామి దేవాలయంలో ఆలయ ప్రధానార్చకులు మోహనకృష్ణ భార్గవ నేతృత్వంలో స్వామి వారికి క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కలెక్టర్ రిజ్వాన్ బాషాకు రాఖీ కడుతున్న విద్యార్థులు

కిటకిటలాడిన జిల్లా కేంద్రం..

రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని ఆడపడుచుల రాకపోకలతో జిల్లా కేంద్రం కిటకిటలాడింది. ప్రయాణికులతో బస్టాండు నిండిపోయింది. ఆర్టీసీ బస్సులు కిక్కిరిసిన ప్రయాణికులతో ప్రయాణించాయి. స్వీటు షాపులు, రాఖీల దుకాణాలు రద్దీగా మారాయి. జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారులు వాహనాలతో కిక్కిరిసిపోయాయి. పోలీసులు బందోబస్తు నిర్వహించి వాహనాల రాకపోకలను నియంత్రించారు. తిరుగు ప్రయాణంలో భారీ వర్షం కురియడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

వేంకన్న ఆలయంలో శ్రవణ నక్షత్ర హోమం

పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు



స్వామి వారి కల్యాణం, శ్రవణ నక్షత్ర హోమం జరిపిస్తున్న పూజారులు

చిలుపూర్, ఆగస్టు 19: శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని చిలుపూర్ గుట్ట బుగులు వేంకన్న ఆలయంలో ఘనంగా హోమ పూజ నిర్వహించారు. సోమవారం ఆలయ ఆవరణలో జరిగిన మాస కల్యాణ మహోత్సవ పూజా కార్యక్రమానికి భక్తులు పెద్దసంఖ్యలో హాజరు కాగా, ప్రధాన అర్చకుడు బ్రాహ్మణపల్లి రవీందర్‌శర్మ, పూజారులు సౌమిత్రి రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేదమంత్రాల మధ్య ఉత్సవమూర్తులకు కల్యాణం జరిపించారు. అనంతరం భక్తులకు శేష వస్త్రాలతో పాటు, స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు. పేరి లక్ష్మీనారాయణ-ప్రభావతిదేవి దంపతుల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో దేవస్థానం మాజీ చైర్మన్, ఆలయ శాశ్వత దాత పొట్లపల్లి శ్రీధర్‌రావు, ఈవో లక్ష్మీప్రసన్న, జూనియర్ అసిస్టెంట్ కుర్రెంల మోహన్, రికార్డు అసిస్టెంట్ వీరన్న, గాదె రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్, ఆగస్టు 19: ప్రజలు వివిధ సమస్యలపై ప్రజావాణిలో సమర్పించే దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. జనగామలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్లు రోహిత్‌సింగ్, పింకేష్‌కుమార్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణిలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలన్నారు. అర్జీల పట్ల ఎటువంటి అలసత్వం వహించరాదని, సమస్యలు పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు.

కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, ఆర్డీవోలు వెంకన్న, కొమురయ్య, డీఆర్డీవో వసంత, డీఈవో రాము, డీఎస్‌వో రోజారాణి, డీడబ్ల్యూవో జయంతి, డీపీవో వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీపై వినతుల స్వీకరణ

మండలానికో అధికారి నియామకం

జనగామ రూరల్, ఆగస్టు 19: జిల్లాలో రుణమాఫీ కాని, పూర్తి స్థాయిలో మాఫీ పొందని రైతుల నుంచి మంగళవారం నుంచి వినతులు స్వీకరించేందుకు మండలానికో అధికారిని నియమించినట్లు కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనగామ మండలం - కరుణాకర్(72888 94739), బచ్చన్నపేట- విద్యాకర్‌రెడ్డి(72888 94741), నర్మెట - సంతోషి(72888 94742), తరిగొప్పుల-బీనా(72888 94738), పాలకుర్తి - పరశురాములు(72888 94732), కొడకండ్ల - విజయ్ రెడ్డి(72888 94737), దేవరుప్పుల - సంతోష్(80961 16885), స్టేషన్‌ఘన్‌పూర్ - చంద్రాన్‌కుమార్(72888 94727), చిలుపూరు - వినయ్‌కుమార్(82476 37915), జఫర్‌గడ్ - శిరీష(79933 68101), రఘునాథపల్లి - శ్రీనివాస్‌రెడ్డి(72888 94730), లింగాలఘణపురం - వెంకటేశ్వర్లు(72888 94731) వ్యవసాయ అధికారులను నియమించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన బైక్

ఒకరి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

స్టేషన్‌ఘన్‌పూర్ మండలం మీదికొండ క్రాస్‌రోడ్డు వద్ద ఘటన

వివరాలు 8వ పేజీలో...

విద్యా పురోగతికి న్యాస్



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో, ఏఎంవో తదితరులు

చిన్నారుల్లో అభ్యసన ప్రమాణాలు పెంచడమే లక్ష్యంగా సర్వే

ఫలితాల ఆధారంగా విద్య, మౌలిక వసతుల కల్పనకు నిధుల కేటాయింపు

జిల్లాను ముందంజలో నిలిపేందుకు కృషి

జనగామ కల్చరల్, ఆగస్టు 19: దేశంలో విద్యా వ్యవస్థ పురోగతిని, విద్యార్థుల ప్రతిభా సామర్థ్యాలు తెలుసుకునేందుకు ప్రతీ మూడు సంవత్సరాలకు ఒకసారి జాతీయ వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఎంపిక చేయబడిన పాఠశాలల్లో వివిధ తరగతుల్లో సర్వే చేస్తారు. దీనిని నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే(న్యాస్)గా పిలుస్తారు. ఇందులో భాగంగా విద్యార్థుల ప్రగతిని అంచనా వేయడానికి వారి అభ్యసన సామర్థ్యాలను మూల్యాంకనం చేస్తారు. తద్వారా వివిధ స్థాయిలలో లోపాలను నివారించి తగిన చర్యలు తీసుకోవడం సాధ్యమవుతుంది.

పరీక్షకు సన్నద్ధం చేసేలా..

న్యాస్‌కు విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు శిక్షణ కార్యక్రమాలు మొదలయ్యాయి. ఈ దఫా 2024 నవంబరు 30న పరీక్షను నిర్వహించనున్నారు. 3, 6, 9 తరగతుల్లో ఎంపిక చేసిన ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థులు ఈ పరీక్షకు హాజరవుతారు. ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు ఇంగ్లీషు, గణితమంటే వణికిపోకుండా నూతన పద్ధతుల్లో వారిని సన్నద్ధం చేయనున్నారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. కనీస పరిజ్ఞానం కొరవడడంతో పాటు భాషలో బలహీనంగా, వెనుకంజలో ఉన్న విద్యార్థులను గుర్తించి శిక్షణ ఇవ్వనున్నారు. పరీక్షకు సన్నద్ధం చేస్తున్నారనే విషయం విద్యార్థికి తెలియకుండానే జరుగుతుంది.

తొలిమెట్టు ఉపయోగంగా..

విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలు మదింపు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో మూడేళ్లకోసారి ఈ సర్వే

» మిగతా 8వ పేజీలో...

తరగతి వారీగా విద్యార్థుల సంఖ్య

తరగతి	విద్యార్థుల సంఖ్య
3వ	2386
6వ	3096
9వ	3887

న్యాస్-2021 ఫలితాలు ఇలా.. (శాతంలో)

తరగతి	నేషనల్ యావరేజీ	స్టేట్ యావరేజీ	జనగామ జిల్లా యావరేజీ
3వ	59	45.6	48.1
5వ	49	38.6	44
6వ	37.8	36.7	37.7
8వ	41.9	37.2	38.3

రోజూ చివరి గంట న్యాస్‌కు శిక్షణ : కె.రాము, జిల్లా విద్యాశాఖాధికారి



జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ప్రతి రోజు చివరి గంట న్యాస్-2024 పరీక్షకు సంబంధించి ప్రత్యేక తరగతులు నిర్వహించాలి. మాదిరి ప్రశ్నలను రూపొందించి విద్యార్థులకు రోజువారీ పరీక్షలు జరపాలి. వారికి ప్రశ్నపత్రంపై పూర్తి అవగాహన కల్పించాలి. జిల్లాలో విద్యార్థులకు అభ్యసన సామర్థ్యాలు పెంపొందేలా ఉపాధ్యాయులు కృషి చేయాలి.

విద్యార్థులపై ప్రత్యేక దృష్టి బొమ్మనబోయిన శ్రీనివాస్, ఏఎంవో, జనగామ



న్యాస్ పరీక్షకు ప్రణాళికతో ముందుకు సాగుతున్నాం. ప్రాక్టీస్ పేపర్లతో నిర్వహించే పరీక్షలతో విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేసి వెనుకబడిన వారిపై ప్రత్యేక దృష్టి నిలపనున్నాం. ఈసారి న్యాస్‌లో జిల్లా ముందంజలో నిలిచేందుకు ఉపాధ్యాయులు కృషి చేసేలా డీఈవో పర్యవేక్షణ, సలహాలతో ముందుకు వెళుతున్నాం.

ప్రైవేటు ఆస్పత్రుల తనిఖీ

వరంగల్ మెడికల్, ఆగస్టు 19 : సీజనల్ వ్యాధుల నియంత్రణలో భాగంగా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం హనుమకొండలోని పలు ప్రైవేటు ఆస్పత్రులను తనిఖీ చేసినట్లు ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ కె.లలితాదేవి తెలిపారు. వారంలో రెండు రోజులు ప్రభుత్వ ఆస్పత్రులు, రెండు రోజులు ప్రైవేటు ఆస్పత్రుల్లో జ్వరాలు నమోదు అవుతున్న తీరు, ఎంత మందికి అడ్మిషన్ అవసరం ఉందని, ప్లేట్‌లెట్ సంఖ్య లక్షలోపు ఎంత మంది ఉన్నారని వివరాలు తెలుసుకోవడం జరుగుతుందన్నారు. అలాగే వ్యాధి నిర్ధారణ పరీక్షల తీరును సైతం సమీక్షించనున్నట్లు పేర్కొన్నారు. ర్యాపిడ్ కిట్‌లో పాజిటీవ్ వచ్చినట్లయితే వారి నమూనాలను ఎంజీఎం ల్యాబ్‌కు పంపించాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 28 డెంగీ పాజిటీవ్ కేసులు నమోదు అయ్యాయని, మలేరియా పాజిటీవ్ కేసులు నమోదు కాలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయ్ కుమార్, జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ హిమబిందు, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి ఇన్‌చార్జి డాక్టర్ ఇష్తికర్ అహ్మద్, డాక్టర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలోని రోగులతో మాట్లాడుతున్న అధికారులు

అప్పుల బాధతో మత్స్యకార్మికుడి ఆత్మహత్య

హసన్‌పర్తి, ఆగస్టు 19: అప్పుల బాధతో మత్స్య కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం హసన్‌పర్తి ఇందిరాకాలనీలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ చేరాలు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రంలోని ఇందిరాకాలనీకి చెందిన పిట్టల రమేష్ (48) కుటుం బం చేపలు పట్టుకొని అమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. సంవత్సరం క్రిత మే కూతురు వివాహం, దీనికి తోడు ఇటీవలే తల్లి మృతి చెందడంతో కుటుంబం అప్పుల ఊబిలోకి కూరుకుపోయింది. దీంతో రమేష్ చేసిన అప్పు లు తీర్చలేక మద్యానికి బానిసై మనస్థాపం చెంది సోమవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రమేష్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ చేరాలు తెలిపారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని ముదిరాజ్ కుల సంఘం ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు.



మృతి చెందిన రమేష్

అంబేద్కర్ విగ్రహానికి రాఖీ కట్టిన మహిళలు



అంబేద్కర్ విగ్రహానికి రాఖీ కడుతున్న ధర్మ సమాజ్ కమిటీ మహిళలు

ఐనవోలు, ఆగస్టు 19: ధర్మ సమాజ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఐనవోలులో అంబేద్కర్ విగ్రహానికి రాఖీ కట్టి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కమిటీ మండల అధ్యక్షుడు కే. ప్రవీణ్, కమిటీ బాధ్యులు లక్ష్మి, మమత రేణుక, శ్వేత, వెన్నెల, స్వప్న, మౌనిక, జోషితలు మాట్లాడుతూ ఆస్తిహక్కు, రాజకీయ హక్కు, విద్య, ఉద్యోగ, ఆత్మగౌరవంతో జీవించే హక్కులు కల్పించిన అన్నయ్యగా రాఖీలు కట్టి తమ అభిమానాన్ని చాటామన్నారు. ఈ కార్యక్రమంలో విష్ణు, వంశీ, గణేష్, జయపాల్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థినిని హత్యాచారం చేసిన వారిని శిక్షించాలి

వడ్డెపల్లి, ఆగస్టు 19: కలకత్తాలో పీజీ వైద్య విద్యార్థినిపై అమాయిత్యం చేసి, హత్య చేసిన మానవ మృగాలను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని సీఐటీయూ, మునిసిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బరుపట్ల మహేష్ డిమాండ్ చేశారు. వైద్య విద్యార్థిని ఆత్మకు శాంతి చేకూరాలని గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో క్యాండిల్ ప్రదర్శన సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు రేణుగుంట్ల సురేష్, దామెర శ్రీను, అనిల్, టీఎంఆర్‌పీఎస్ జిల్లా కార్యదర్శి మూర్తిరాజుతో పాటు మహిళలు పాల్గొన్నారు.

పీజీ వైద్య విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడి హత్యచేసిన బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ డిమాండ్ చేశారు. సోమవారం గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్ జవహర్‌కాలనీలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ప్రతీ మహిళకు అన్ని విధాలుగా రక్షణ చర్యల కోసం ప్రభుత్వాలు మరింత కఠినంగా శిక్షలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు దాడి మల్లయ్య యాదవ్, తమ్మల శోభారాణి, రవీందర్, నాగరాజు, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ డాక్టర్ హత్య అమానుషం

హనుమకొండ టౌన్ : కలకతాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసి, హత్య చేయడం అమానుషమని జనవేదిక రాష్ట్ర సమతా కమిటీ కన్వీనర్ వెలిదండి సుమలత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డాక్టర్‌పై జరిగిన అమానవీయ ఘటన సభ్య సమాజం తలదించుకునేలా ఉందని తెలిపారు. సభ్య సమాజం ఈ ఘటనను ముక్తకంఠంతో ఖండించాలని పేర్కొన్నారు.

రెండు బైక్‌లు ఢీ.. ఇద్దరికి తీవ్రగాయాలు

గీసుగొండ, ఆగస్టు 19: మండలంలోని కొమ్మాల శివారు వరంగల్-నర్సంపేట ప్రధాన రహదారి రత్తీరాంతండా వద్ద రెండు ద్విచక్ర వాహనాలు సోమవారం రాత్రి ఎదురెదురుగా ఢీ కొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం. కొమ్మాలకు చెందిన తాళ్లపెల్లి రాజు నర్సంపేట నుంచి ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా ఎదురుగా మరో బైక్‌పై వచ్చిన నర్సంపేటకు చెందిన సాయి ఢీకొన్నారు. దీంతో కిందపడిపోయిన ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఇద్దరిని ఎంజీఎంకు తరలించారు. కాగా రాజు పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

ఓపెన్ డిగ్రీ, పీజీ ప్రవేశాల గడువు పెంపు

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 19: డాక్టర్ బీఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం డిగ్రీ, పీజీ ప్రవేశ గడువును ఈ నెల 31 వరకు పెంచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. లక్ష్మణ్‌నాయక్, కోఆర్డినేటర్ హతిరాం తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు రీరీరీ.ఛ్బుం ఙజూజ్బ్య.జీ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకుని కళాశాలకు వచ్చి సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేసుకుని ఫీజు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. వివరాలకు 73829 29705ను సంప్రదించాలని సూచించారు.



రాక్ క్లైంబింగ్ చేస్తున్న పర్యాటకులు (ఫైల్)



పాండవుల గుట్టలు

- నిర్లక్ష్యానికి గురైన పాండవులు నివసించిన ప్రాంతం
- అనాదిగా అభివృద్ధికి దూరం
- స్వరాష్ట్రంలోనూ సాధించని పురోగతి
- అపూర్వ చరిత్ర ఉన్నా దక్కని ప్రాధాన్యం
- నేడు ముగ్గురు మంత్రుల పర్యటన
- కాంగ్రెస్ సర్కారు దృష్టిసారిస్తుందని పర్యాటకుల ఆశలు

గుట్టల అభివృద్ధిపై గంపెడు ఆశలు

రేగొండ, ఆగస్టు 19 : పాండవుల గుట్టలు... ప్రకృతి ప్రసాదించిన సహజసిద్ధ సౌందర్యం. ఇవి హిమాలయాల కంటే పురాతనమైనవి. పాండవులు ఇక్కడ నివసించారనే ఆధారాలు ఉన్నాయి ఇక్కడ. అత్యంత అరుదైన రాతి సంపద, వాటిపై చెక్కిన చిత్రాలు పాండువుల గుట్టలకు చారిత్రక ఆనవాలు. దేశంలో 90 ప్రాంతాలను జియో హెరిటేజ్‌సైట్‌గా ఇటీవల కేంద్ర ప్రభుత్వం గుర్తించగా తెలంగాణ రాష్ట్రం నుంచి ఒక్క పాండవుల గుట్టలకు ఈ ఘనత దక్కింది. 2 వేల ఎకరాల్లో విస్తరించి ఉన్నాయి ఈ గుట్టలు. పచ్చని చెట్లతో జీవవైవిధ్యం ఉట్టిపడుతుం దిక్కడ. అయితే... ఇంత విశిష్టత కలిగిన ఈ చారిత్రక ప్రదేశం పర్యాటకంగా మాత్రం ఆశించినంతగా అభివృద్ధిని సాధించలేకపోయింది. ప్రభుత్వాలు మారినా అనాదిగా ఇది నిర్లక్ష్యానికి గురైంది. ప్రత్యేక రాష్ట్ర సాధన అనంతరం కూడా పాండవుల గుట్టలకు ప్రాధాన్యం దక్కలేదు. కొత్తగా కొలువుదీరిన సర్కారు అయినా దీనిపై దృష్టి పెట్టాలని పర్యాటకులు, స్థానికులు కోరుతున్నారు. ఇదే క్రమంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క మంగళవారం ఇక్కడ పర్యటించనున్నారు. దీంతో పర్యాటకులు, స్థానికుల్లో ఆశలు చిగురించాయి. ఇప్పటికైనా ఈ ప్రాంతం అభివృద్ధికి నోచుకోవాలని సర్వత్రా కాంక్షిస్తున్నారు. అత్యధికంగా నిధులు కేటాయించి అంతర్జాతీయ స్థాయిలో పర్యాటకులను ఆకర్షించేలా పాండవుల గుట్టలను అభివృద్ధి చేయాలని కోరుకుంటున్నారు. పర్యాటకంగా అభివృద్ధి చేయాలంటే ఎలాంటి కార్యాచరణ ఉండాలి.. ఏమేం చేయాలని అనే అంశాలపై పలువురు తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

నైట్ క్యాంప్ కోసం..

పాండవుల గట్టల సందర్శనకు ఇప్పటికే పర్యాటకులు వస్తుంటారు. ఈ నేపథ్యంలో నైట్ క్యాంప్ కోసం అధికారులు జిప్ టెంట్లు కొనుగోలు చేశారు. పాండవుల గుట్టల వెనకాల క్యాంపు ఏర్పాటు చేయడానికి దంసకుంట చెరువు పక్కన స్థలాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ శాశ్వత మరుగుదొడ్ల నిర్మించాలని నిర్ణయించినప్పటికీ నిధులు కేటాయించకపోవడంతో ఆ ప్రతిపాదన మరుగునపడిపోయింది. ఈ ప్రదేశంలో శాశ్వత మరుగుదొడ్లు నిర్మించాలని పర్యాటకులు కోరుతున్నారు. మార్నింగ్ వాక్ చేయడానికి అనువుగా పోతరాజు చెలిమ వరకు రోడ్డు ఏర్పాటు చేయాలంటున్నారు.

కేబుల్‌కార్, కేబుల్ బ్రిడ్జి ఏర్పాటు చేస్తే..

అందమైన ఆకృతులతో ఎత్తయిన కొండలు, పచ్చని ప్రకృతి పాండవుల గుట్టల సొంతం. ఇలాంటి ప్రదేశంలో కేబుల్‌కార్, కేబుల్ బ్రిడ్జి ఏర్పాటు చేస్తే పర్యాటకులను ఆకర్షించొచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇలాంటి సౌకర్యాలు ఉంటే కాళేశ్వరం, రామప్ప ఆలయాలకు వచ్చే భక్తులు, పర్యాటకులు కూడా పాండవుల గుట్టలను సందర్శించే అవకాశం ఉంటుందని అంటున్నారు.

గెస్ట్ హౌస్‌లు.. కాంటీన్

సుదూర ప్రాంతాల నుంచి కూడా పాండవుల గుట్టలకు పర్యాటకులు వస్తుంటారు. వారి కోసం గెస్ట్‌హౌస్‌లు నిర్మిస్తే రోజంతా విడిది చేసి పాండవుల గుట్టల ప్రకృతిని ఆస్వాదించే అవకాశం ఉంటుందని పలువురు కోరుతున్నారు. అలాగే ఇక్కడ హరిత హోటల్ పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని అంటున్నారు.

సెక్యూరిటీ.. సౌకర్యాల కల్పన

గుట్టలు ఉన్న ప్రాంతాల్లో పర్యాటకులకు రక్షణ, మౌలిక సౌకర్యాలు కల్పించడం అత్యంత ప్రధానం. గుట్ట పైకి వెళ్లే క్రమంలో సెక్యూరిటీ లేకపోతే పర్యాటకులు అభద్రతభావానికి గురయ్యే అవకాశం ఉంటుందని అభిప్రాయం వ్యక్తమవుతోంది. స్థానిక యువకులకు శిక్షణ ఇప్పించి సెక్యూరిటీగా నియమిస్తే ఉపాధి కల్పించడంతో పాటు పర్యాటకులకు, రాతి చిత్రాలకు రక్షణ కల్పించొచ్చని అంటున్నారు. తాగునీటి సౌకర్యం కోసం పాండవుల గుట్ట కింద ప్రాంతంలో మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటు చేసినప్పటికీ అది పదే పదే మరమ్మతులకు వస్తోందని, కొత్త దాన్ని ఏర్పాటు చేసి పలు చోట్లా ట్యాపులు బిగించాలని కోరుతున్నారు. కొండ పైన మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం కూడా ఏర్పాటు చేయాలని అంటున్నారు.

రాక్ క్లైంబింగ్ పునరుద్ధరిస్తే..

గతంలో ఇక్కడ ప్రతి ఆదివారం రాక్‌క్లైంబింగ్ నిర్వహించేవారు. ఇందుకు స్థానిక యువకులను ఇన్‌స్ట్రక్టర్లుగా నియమించారు. కరోనా కాలంలో రాక్ క్లైంబింగ్ నిలిచి పోయింది. దీన్ని పునరుద్ధరించాలని పర్యాటకులు కోరుతున్నారు. ట్రెక్కింగ్ చేసే వారికి సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తే సౌకర్యంగా ఉంటుందని అంటున్నారు.

జింకల పార్కు, పిల్లల గార్డెన్ ఏర్పాటు

పాండవుల గుట్టల నుంచి బుగులోని జాతర వెళ్లే మార్గంలో జింకలపార్కు, పిల్లల గార్డెన్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన పెండింగ్‌లో ఉంది. ఉన్నతాధికారులు నివేదికను సిద్ధం చేసినా నిధులు మంజూరు కాక అది మరుగునపడింది. ఇప్పటికైనా జింకల పార్కు, పిల్లల గార్డెన్ ఏర్పాటు కార్యరూపం దాల్చాలని పర్యాటకులు కోరుతున్నారు.



వైభవంగా రుద్రేశ్వరుడికి అన్నపూజ

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 19 : చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో శ్రావణ మాస పౌర్ణమి శివప్రీతికర సోమవారం రాఖీ పౌర్ణమి వేళ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో గణపతికి అరిద్రకుంకుమ లేపనంతో, రుద్రేశ్వరుడికి పాశుపద మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు నిర్వహించారు. 108 మంది శివదీక్షాపరులచే సామూహిక రుద్రాభిషేకాలు చేశారు. అనంతరం 51 కిలోల పెరుగు అన్నంతో అన్నసూక్త మంత్రపఠనంతో మహా అన్నపూజ నిర్వహించారు. రుద్రేశ్వరుడికి ప్రత్యేక రాఖీలు కట్టి రాఖీ రుద్రేశ్వరుడిగా అలంకరింప చేయడం విశేషం. ఈసందర్భంగా ఆలయానికి తరలి వచ్చిన భక్తులకు మహా అన్నదానం నిర్వహించారు. ఆలయ అర్చకులు మణికంఠశర్మ, ప్రణవ్, సందీప్‌లతో పాటు ఆలయ సిబ్బంది మధుకర్, రామకృష్ణ, రజాక్, ఎం. సుజాత తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రదోషకాల సమయంలో టీటీడీ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శ్రావణ మాస విశిష్టతపై ప్రత్యేక ఉపన్యాసం నిర్వహించినట్లు, అదే విధంగా ఉమ్మడి జిల్లాలోని ఆరు ప్రాంతాలలో శ్రావణ పౌర్ణమి వేళ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించినట్లు కో ఆర్డినేటర్ రామిరెడ్డి కృష్ణమూర్తి చెప్పారు.

భద్రకాళి అమ్మవారికి పవిత్రోత్సవం



వరంగల్ కల్చరల్, ఆగస్టు 19: శ్రావణ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని చారిత్రక భద్రకాళి అమ్మవారికి సోమవారం పవిత్రోత్సవం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానార్చకులు భద్రకాళి శేషు నేతృత్వంలో అర్చక బృందం నూలుతో వివిధ రకాల దండలు (పవిత్రోత్సవాలు) మాలలను అమ్మవారికి అలంకరించారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో శేషు భారతి అమ్మవారి శేషవస్త్రాలు అందించగా, ప్రధానార్చకులు ఆశీర్వాదం, తీర్థ ప్రసాదాలు అందించారు.



మృతి చెందిన జనగాని సదానందం (ఇన్‌సెట్‌లో ఫైల్)

పండగ పూట విషాదం

- మోకు తెగి కింద పడి గీత కార్మికుడి మృతి

హసన్‌పర్తి, ఆగస్టు 19: అనుబంధానికి ప్రతీకగా నిర్వహించుకునే రాఖీ పండగ పూట హసన్‌పర్తి మండలం జయగిరిలో విషాదం చోటు చేసుకుంది. తాటి చెట్టు ఎక్కి దిగుతుండగా మోకు తెగి జారి కింద పడి గీత కార్మికుడు అక్కడిక్కడే ప్రాణాలు వదిలిన ఘటన సోమవారం జరిగింది. హసన్‌పర్తి సీఐ చేరాలు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జయగిరికి చెందిన జనగాం సదానందం (58)కి ఒక కొడకు, కూతురు. మడిపల్లి గ్రామం నుంచి వలస వచ్చి జయగిరిలోనే జీవనం సాగిస్తున్నారు. భార్య ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందగా కొడుకు సుమన్ ఇంటి వద్దే ఉంటున్నాడు. ఇద్దరు పిల్లలకు రెక్కల కష్టంతోనే వివాహం జరిపించాడు. సోమవారం సుమన్‌కు రాఖీ కట్టేందుకు ఇంటికి వచ్చిన కూతురికి ఇప్పుడే రెండు మెరలు పెట్టి వస్తానని చెప్పి సదానందం తాటి వనానికి వెళ్లాడు. తాటి చెట్టు ఎక్కి కిందికి దిగుతుండగా మోకు తెగి ఒక్కసారిగా కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు సుమన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చేరాలు తెలిపారు. సదానందం కుటుంబాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని, ప్రభుత్వం నుంచి వచ్చే ఎక్స్‌గ్రేషియా తక్షణమే చెల్లించాలని మాజీ జెడ్పీటీసీ కొత్తకొండ కవితసుభాష్‌గౌడ్, గీత కార్మిక సంఘం ప్రతినిధులు మోటపోతుల రాజు, కొక్కొండ రమేష్, తదితరులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గీత కార్మికుడి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

కాజీపేట : సదానందం కుటుంబానికి ప్రభుత్వం రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని తెలంగాణ కల్లు గీతకార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ గౌడ్ సోమవారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతే సదానందం వృత్తిలో భాగంగా తాడిచెట్టు ఎక్కేక్రమంలో పై నుంచి కిందపడి అక్కడిక్కడే మరణించాడని చెప్పారు. ప్రభుత్వం గీత కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని ఆయన కోరారు.

కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలి

- దక్షిణమధ్య రైల్వే జీఎంను కోరిన ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి



రైల్వే జీఎంతో సమావేశం అయిన ఎంపీ కావ్య, ఎమ్మెల్యే శ్రీహరి

కాజీపేట, ఆగస్టు 19 : కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటుతో పాటు రైల్వే పెండింగ్ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సోమవారం సికింద్రాబాద్‌లో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ కావ్య మాట్లాడుతూ.. ఉత్తర భారత దేశాల రైల్వే మార్గాలను కలిపే కాజీపేట, వరంగల్ రైల్వే స్టేషన్‌లు భారత రైల్వేలోనే అతిప్రధానమైనవని, ప్రధానంగా కాజీపేట రైల్వే స్టేషన్‌లో రైళ్ల ట్రాఫిక్‌ను నివారించడానికి అదనపు ప్లాట్‌ఫారాలు, ఫుట్‌ఓవర్ బ్రిడ్జీలు నిర్మించాలని కోరారు. కాజీపేట టౌన్‌స్టేషన్ పూర్తిస్థాయి స్టాండింగ్ స్టేషన్‌గా మార్చాలని, రైల్వే ఆసుపత్రికి మరిన్ని నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని కోరారు. రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్‌కు కొత్త భవనం నిర్మించాలని, కమ్యూనిటీ హాల్‌ను అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు.

కాజీపేటలో 3వేల మందికి పైగా రైల్వే ఉద్యోగులు, వైద్యసహాయం అవసరమయ్యే రిటైర్డ్ ఉద్యోగులు మరో 3వేల మందికి వరకు ఉన్నారని, వీరందరి కోసం కాజీపేట రైల్వే అస్పత్రిని అభివృద్ధి చేయటంతో పాటు అదనపు సిబ్బంది, అదనపు సౌకర్యాలు కల్పించి, నిపుణులైన వైద్యులతో పూర్తి స్థాయి సబ్‌డివిజనల్ అస్పత్రిని ప్రారంభించేందుకు నిధులు కేటాయించాలని ఎంపీ కోరారు. రైల్వే జనరల్ ఇన్‌స్టిట్యూట్, ఉద్యోగుల రిక్రియేషన్ క్లబ్‌కు కొత్త భవనం ఏర్పాటుతో పాటు కమ్యూనిటీ హాల్ అభివృద్ధి చేయాలని కోరారు.

స్టేషన్‌ఘన్‌పూర్ రెవెన్యూ డివిజన్ హెడ్‌క్వార్టర్స్‌లో అనేక డివిజన్ స్థాయి ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయని, అధిక సంఖ్యలో అధికారులు, హైదరాబాద్ విజయవాడకు వెళ్తారని, ఈ రైల్వే స్టేషన్ చుట్టూ 60 గ్రామాలు ఉన్నాయని, దీనిని పరిశీలించి పద్మావతి ఎక్స్‌ప్రెస్‌కు స్టేషన్‌ఘన్‌పూర్‌లో హాల్టింగ్ కల్పించాలని కోరారు. నష్కల్ నుంచి చింతలపల్లి, నష్కల్ నుంచి హసన్‌పర్తి వరకు రెండు మార్గాల్లో రైల్వే బైపాస్ లైన్‌లను నిర్మించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, వరంగల్ పట్టణ అభివృద్ధికి అడ్డంగా మారే ప్రమాదం ఉందని, దీనికి ప్రత్యామ్నాయంగా అలైన్‌మెంట్‌లో మార్పుచేసి మరో మార్గంలో రైల్వేలైన్ ఏర్పాటు చేయాలని తెలిపారు. వినతిపత్రం స్వీకరించిన రైల్వే జీఎం రైల్వే ఆసుపత్రి అభివృద్ధికి రూ.1.75 కోట్లు మంజూరు చేస్తున్నామని, టౌన్‌స్టేషన్‌లో వేయిటింగ్‌హాల్స్ నిర్మిస్తామని, కాజీపేట డివిజన్ ఏర్పాటుకై పూర్తి సమాచారాన్ని రైల్వే బోర్డుకు పంపించామని, త్వరలో డివిజన్ ఏర్పాటు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారని వారు చెప్పారు. బైపాస్ లైన్‌ల డిజైన్‌ల మార్పును పరిశీలిస్తామని, రైల్వే సమస్యలపై రైల్వే జీఎం సానుకూలత తెలిపినట్లు ఎంపీ కడియం కావ్య, మాజీ ఉపముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు.

ఎంపీ కావ్యకు ప్రత్యేక కృతజ్ఞతలు

- టీరైల్వే ఎంప్లాయిస్ జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్

వరంగల్ పార్లమెంట్ పరిధిలో పెండింగ్ ప్రాజెక్ట్‌లపై రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌ను ఎంపీ కడియం కావ్య కలిసి ప్రస్తావించినందకు టీరైల్వే ఎంప్లాయిస్ జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. 140 సంవత్సరాల క్రితం కట్టిన రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్‌కు నూతన భవనం నిర్మించాలని, కమ్యూనిటీహాల్‌కు అదనపు సౌకర్యాలు కల్పించాలని, రైల్వే ఆసుపత్రికి అదనపు సిబ్బంది ఏర్పాటు, రైల్వే ఉద్యోగుల సమస్యలు తీర్చాలని ఎంపీ కడియం కావ్య రైల్వే జీఎం దృష్టికి తీసురావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

కిడ్నీ మార్పిడి సదస్సులో డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డికి అవార్డు



మాట్లాడుతున్న డాక్టర్ మన్నెం శ్రీనాథ్‌రెడ్డి

వరంగల్ మెడికల్, ఆగస్టు 19 : కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ సదస్సు 204 యూరాలజిస్టు వైద్యుల సదస్సులో హనుమకొండ ముత్య కిడ్నీ సెంటర్ యూరాలజిస్టు డాక్టర్ మన్నెం శ్రీనాథ్‌రెడ్డికి ద్వితీయ బహుమతి లభించింది. భువనేశ్వర్‌లో జరిగిన జాతీయ కిడ్నీ మార్పిడి, వాస్క్యులర్ యాక్సెస్ (ఏ వి- ఫిస్టులా ఆపరేషన్) సదస్సులో ఉత్తమ వీడియో ప్రదర్శనలో అవార్డు పొందారు. డయాలసిస్ రోగులలో పారాచూట్ టెక్నిక్‌తో వరంగల్ రోగులకు అత్యాధునిక పద్ధతిలో విజయవంతమైన సేవలు అందించామని డాక్టర్ మన్నెం శ్రీనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ పద్ధతి ద్వారా ముత్య కిడ్నీ సెంటర్‌లో ఆరోగ్యశ్రీ పథకంలో ఉచితంగా కొంత మంది రోగులకు సేవలు అందించామన్నారు. వరంగల్‌లోని పేద రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇప్పటి వరకు 90శాతం సక్సెస్ రేటును పొందామని, అరుదైన ఆపరేషన్‌లకు సంబంధించిన వీడియో ప్రదర్శన జాతీయస్థాయిలో ఆకట్టుకుందని తెలిపారు. ఈ అవార్డు పొందినందుకు హనుమకొండ ముత్య కిడ్నీ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ బచ్చు చందు కృష్ణ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డిని అభినందించారు. సదస్సు చైర్మన్ డాక్టర్ ఉమేశ్ ఓజా, కార్యదర్శి డాక్టర్ అజయ్ ఓస్వాల్ చేతులమీదుగా అవార్డు అందుకున్నట్లు డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. పలువురు ఐఎంఏ వైద్యులు, హనుమకొండ ముత్య కిడ్నీ సెంటర్ వైద్యులు డాక్టర్ పాపయ్య నిర్మల్, డాక్టర్ సందీప్, సిబ్బంది మన్నెం శ్రీనాథ్‌రెడ్డిని అభినందించారు.

సీఆర్పీఎఫ్ బెటాలియన్ ఎత్తివేత

- మణిపూర్‌కు తరలింపు
- నేటి నుంచి 25లోగా తరలివెళ్లనున్న జవాన్లు
- 1100 మంది జవాన్లు పని చేసేవారు



వరంగల్ క్రైం, ఆగస్టు 19 : నగరంలోని కాకతీయ యూనివర్సిటీ పోలీసు స్టేషన్ సమీపంలో ఉన్న 58వ సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ శాశ్వతంగా ఎత్తివేశారు. ఈ మేరకు కేంద్ర సీఆర్‌పీఎఫ్ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మావోయిస్టుల ప్రభావం ఎక్కువగా ఉన్న సమయంలో 1990లో కాకతీయ యూనివర్సిటీ స్థలంలో బెటాలియన్ ఏర్పాటు చేశారు. 58వ బెటాలియన్ పరిధిలో వివిధ విభాగాలకు చెందిన 1100 మంది జవాన్లు పని చేస్తున్నారు. ఇక్కడి నుం చే వరంగల్, ఖమ్మం, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల్లో జవాన్లు విధులు నిర్వహిస్తూ ఉంటారు. ప్రస్తుతం వరంగల్‌లో మావోయిస్టుల ప్రభావం తగ్గడంతో 58వ డివిజన్ మణిపూర్‌కు తరలించాలని నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. మంగళవారం 25వ తేదీలోగా పూర్తిగా జవాన్లు తరలివెళ్లనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేశారు. కాగా, 58వ బెటాలియన్ పరిధిలో పని చేస్తున్న కాటారం, మహాముత్తారం కంపెనీలు సైతం తరలి వెళ్లనున్నట్లు సమాచారం.

సీఆర్‌పీఎఫ్ క్వార్టర్స్ అంటే హడల్...

మావోయిస్టు ప్రభావం ఎక్కువగా ఉన్న సమయంలో విచారణకు సీఆర్‌పీఎఫ్ క్వార్టర్స్ అడ్డాగా ఉండేది. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిసర ప్రాంతాల్లో పట్టుబడిన మావోయిస్టులను పోలీసులు ఇక్కడికి తీసుకవచ్చి తమదైన పద్ధతిలో విచారించే వారని సమాచారం. చీకటి గదుల్లో వేసి విచారణ సాగించే వారనే ఆరోపణలు ఉన్నాయి. మావోయిస్టులే కాకుండా ఇతర నేరాలకు పాల్పడిన చాలా మందిని ఇక్కడ విచారణ చేసినట్లు సమాచారం. ఏదైనా విచారణ పేరిట నిందితులను క్వార్టర్స్‌కు తరలిస్తే హడలి పోయేవారు.

మావోయిస్టుల ప్రభావం ఎక్కువగా ఉన్న సమయంలో ఇద్దరు పోలీసు అధికారులు సీఆర్‌పీఎఫ్ క్వార్టర్స్ అడ్డాగా విచారణ చేసే వారని సమాచారం. జిల్లాలో ఎక్కడ ఎవరు పట్టుకున్నా ఈ ఇద్దరు పోలీసు అధికారుల సమక్షంలోనే చాలా కేసుల విచారణ సాగేదని తెలిసింది. మొత్తంగా సీఆర్‌పీఎఫ్ క్వార్టర్స్ 1990 నుంచి 2000 వరకు విచారణకు కేంద్రంగా ఉండేదని అధికారిక సమాచారం.

బాధ్యత మరువని అన్న.. బంధం వీడని చెల్లి..

- సోదరుడుకి బస్సులోనే రాఖీ కట్టిన సోదరి



ఆర్టీసీ బస్సులోనే కండక్టర్ కృష్ణమూర్తికి రాఖీ కడుతున్న సరస్వతి

శాయంపేట, ఆగస్టు 19: విధినిర్వహణలో బాధ్యతగా మెలిగే ఆ అన్నకు.. ఆయన విధినిర్వహణలో ఉన్న సమయంలో రాఖీ కట్టిన ఓ చెల్లి తన అనురాగాన్ని చాటుకుంది. భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రానికి చెందిన పోకల కృష్ణమూర్తి భూపాలపల్లి ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్నారు. ఆయన రోజులాగే సోమవారం కూడా విధులకు హాజరైన ఆయన హనుమకొండ నుంచి కాళేశ్వరం బస్సులో విధినిర్వహణలో ఉన్నారు. సోమవారం రాఖీ పండుగ కావడంతో తన అన్నకు రాఖీ కట్టాలనుకున్న ఆయన చెల్లెలు శాయంపేట మండలం పెద్దకోడెపాకకు చెందిన ముక్కా సరస్వతి తన అన్న కండక్టర్‌గా ఉన్న బస్సు పెద్దకోడెపాక క్రాస్ వద్దకు రాగానే బస్సు ఆపి, ప్రయాణికుల సమక్షంలో బస్సులో తన అన్నకు రాఖీ కట్టి అనురాగాన్ని చాటుకుంది. ఈ సందర్భంగా సరస్వతి స్పందిస్తూ తన అన్నలాంటి ఆర్టీసీ కార్మికులు పండుగ రోజు సెలవులు పెడితే తమ పుట్టిళ్లకు వెళ్లి సోదరులకు రాఖీలు కట్టాలనుకునే సోదరీమణులకు ఇబ్బందులు కలుగుతాయన్నారు.

రాష్ట్రానికి రక్షణ కరువైంది

- కుట్రలో భాగంగానే జీవో 55 రద్దు
- మహిళలకు ఉచిత ప్రయాణం సమ్మతమే
- బస్సు సర్వీసులు పెంచకుంటే ప్రమాదాలు జరిగే అవకాశం
- బీఆర్ఎస్ రాష్ట్రనేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

ములుగు, ఆగస్టు 19: కాంగ్రెస్ పాలనలో రాష్ట్రానికి రక్షణ కరువైందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అరాచక చర్యలతోనే పోలీసులు దళిత మహిళను వివస్త్రను చేసి కొట్టే పరిస్థితులు వచ్చాయని బీఆర్ఎస్ రాష్ట్రనేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ నాయకుడు భూక్య జంపన్న ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జంపన్న చారిటబుల్ ట్రస్టును సోమవారం ఆయన ప్రారంభించారు. అంతకుముందు గట్టమ్మ తల్లి దేవాలయాన్ని దర్శించుకున్న ప్రవీణ్‌కుమార్ బస్టాండు సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ట్రస్టును ప్రారంభించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రజావ్యతిరేక పాలనతో జనంలో వ్యతిరేకత వస్తోందని, మరో పోరాటానికి సిద్ధమవుతారన్నారు. మెజారిటీ ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటూ దేవుళ్లకు మొక్కుకుంటున్నారన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. కామారెడ్డి సభకు రాహుల్‌గాంధీని తీసుకువచ్చిన రేవంత్‌రెడ్డి చేసిన బీసీ డిక్లరేషన్‌ను అధికారంలోకి వచ్చిన తర్వాత పక్కకు పెట్టారని ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తామని చెప్పి ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. కనీసం బీసీ కమిషన్‌కు ఆదేశాలు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. ఇక బీసీ జనాభా గణన ఎప్పుడు చేస్తారో సమాధానమే లేదని తెలిపారు. 563 గ్రూప్-1పోస్టులలో 209 పోస్టులు ఓపెన్ కేటగిరీలో ఉండగా ఇప్పటివరకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు సంబంధించిన కేటాయింపులపై ఇప్పటివరకు స్పష్టత ఇవ్వడంలేదని విమర్శించారు. జీవో 55ను ఆగమేఘాల మీద రద్దుచేసి జీవో 29 తీసుకువచ్చి సామాజిక న్యాయానికి తూట్లు పొడిచారని దుయ్యబట్టారు. పొరుగు రాష్ట్రాల పబ్లిక్ సర్వీసు కమిషన్‌లు అవలంభించిన రిక్రూట్‌మెంట్ విధానం, సుప్రీంకోర్టు తీర్పును స్వయంగా ప్రభుత్వానికి అప్పగించినా స్పందన కనిపించడంలేదని తెలిపారు.

ప్రమాదాలు జరిగితే బాధ్యులెవరు..?

మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం సమంజసమే అయినా బస్సుల సంఖ్యను పెంచకపోవడంతో ఒక్కో బస్సులో 170మంది వరకు ఎక్కుతున్నారని, అవి బస్సులా పుష్పక విమానాలా అని ప్రవీణ్‌కుమార్ ఎద్దేవా చేశారు. సామర్థ్యానికి మించిన జనంతో బస్సులు నడిస్తే కొండగట్టు లాంటి ప్రమాదం పునరావృతమయ్యే అవకాశముందని, దీనికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజల రక్షణపై ఎవ్వరూ మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. కాగా, జంపన్న చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బాలు అనే దివ్యాంగునికి ద్విచక్రవాహనాన్ని ప్రవీణ్‌కుమార్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ఫౌండర్ భూక్యా జంపన్న, బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేష్‌రెడ్డి, సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు నాయక్, ఉపాధ్యక్షుడు పోరిక రాహుల్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

జనగామ కల్చరల్, ఆగస్టు 19: జిల్లాలోని దివ్యాంగ విద్యార్థుల నుంచి ఉపకార వేతనాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి గాను ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్, నేషనల్ స్కాలర్‌షిప్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌కు 9, 10 తరగతుల వారు ఈనెల 31 లోగా, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌కు ఇంటర్ విద్యార్థులు అక్టోబరు 31లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రతీ ఉద్యోగికి బదిలీ సహజం


ఏఎస్ఐ ఉబేదుల్లాను సన్మానిస్తున్న ఎస్ఐ నరేష్ తదితరులు

రఘునాథపల్లి, ఆగస్టు 19: ప్రతీ ఉద్యోగికి బదిలీ సహజమని, వృత్తి నిర్వహణలో చేసిన సేవలు ప్రజల గుర్తింపు పొందేలా ఉండాలని ఎస్ఐ డి.నరేష్ అన్నారు. రఘునాథపల్లి పోలీస్‌స్టేషన్‌లో రెండేళ్ల పాటు ఏఎస్ఐగా పనిచేసిన ఉబేదుల్లా ఎల్కతుర్తి పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వెళ్తున్న సందర్భంగా సోమవారం జరిగిన వీడ్కోలు సన్మానోత్సవ కార్యక్రమానికి ఎస్ఐ డి.నరేష్ హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్తున్న ఉబేదుల్లాను ఎస్ఐతో పాటు పోలీసు సిబ్బంది శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది సామల శ్రీనివాస్, వీరన్న, యాకయ్య, పోతుల శ్రీనివాస్, భాస్కర్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

'మహనీయుల జాతర' కరపత్రం ఆవిష్కరణ

పాలకుర్తి, ఆగస్టు 19: బీపీ మండల్ జయంతిని పురస్కరించుకొని ఈనెల 25న హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగే మహనీయుల జాతర కరపత్రాన్ని పాలకుర్తి మండల కేంద్రంలోని చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సామాజిక న్యాయ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్ మాట్లాడారు. 25న రవీంద్రభారతిలో ఆటపాట బహుజన సంస్కృతిక ఉద్యమం జరుగుతుందని తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ రాపోలు సత్యనారాయణ, చిట్యాల రాంచంద్రం, సాంబయ్య, మామిండ్ల సోమయ్య, కత్తుల యాకయ్య, సతీష్, వివేక్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం


బచ్చన్నపేటలో లూయిస్ జాక్విస్ మాండ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఫొటోగ్రాఫర్లు

బచ్చన్నపేట, ఆగస్టు 19: మండల ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బచ్చన్నపేటలో సోమవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కెమెరా సృష్టికర్త లూయిస్ జాక్విస్ మాండ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం ఫొటోగ్రాఫర్లను ఆదుకోవాలన్నారు. సెల్‌ఫోన్లు వచ్చిన తరువాత ఫొటోగ్రాఫర్ల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. ప్రభుత్వం ఆదుకుంటే మాటల్లో చెప్పలేని ఎన్నో భావాలను చిత్రాలతో పలికిస్తామన్నారు. కార్యక్రమంలో మచ్చ సతీష్, రాపెల్లి శాంతయ్య, సదానందం, శివ, నర్సింహులు, రాజు, సిద్ధులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా రాఖీ సందడి

ఆడపడుచులతో కళకళ

ఆలయాల్లో భక్తుల ప్రత్యేక పూజలు

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, ఆగస్టు 19 : సోదర, సోదరీ బంధానికి, అనురాగానికి, ఆప్యాయతలకు ప్రతీక అయిన రక్షా బంధన్ పండుగను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. తోబుట్టువుల రాకతో ఇంటింటా సందడి నెలకొంది. అక్కా చెల్లెళ్లు, అన్నదమ్ముల ఇళ్లకు చేరుకుని రాఖీలు కట్టి స్వీట్లు తినిపించి ఆయురారోగ్యాలతో విలసిల్లాలని దీవించారు. తోబుట్టువులకు సోదరులు చీర, సారెలు, నగదు కానుకలుగా అందించారు. దూరప్రాంతాల నుంచి కూడా సోదరీమణులు రావడంతో బస్సులు రద్దీతో కిటకిట లాడాయి. స్వీట్ దుకాణాలు, రాఖీ షాపులు, బట్టల దుకాణాల వద్ద రద్దీ నెలకొంది. స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ టి.రాజయ్యకు హనుమకొండలోని ఇంట్లోనలుగురు తోబుట్టువులు రాఖీ కట్టారు. మరో సోదరుడు ఘన్‌పూర్ మాజీ సర్పంచ్ టి.సురేష్‌కు కూడా రాఖీలు కట్టారు. నియోజకవర్గంలోని మండలకేంద్రాలు, గ్రామాల నుంచి మహిళానాయకురాళ్లు, మహిళలు విచ్చేసి ఎమ్మెల్యేకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

● బచ్చన్నపేట: మండలవ్యాప్తంగా రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. అన్నాచెల్లెళ్ల పవిత్ర బంధాన్ని దృఢంగా ఉంచేలా ఆకాంక్షిస్తూ జరుపుకునే రక్షాబంధనం గ్రామాల్లో కన్నుల పండువలా సాగింది. అక్కాచెల్లెళ్లు సోదరులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఇందుకు కానుకలు అందించి తోబుట్టువులను సంతోషపర్చారు.

● చిలుపూర్: అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా రాఖీ నిలుస్తోందని రైతుబంధు సమితి మండల మాజీ అధ్యక్షుడు జనగామ యాదగిరి, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా నియోజకవర్గ నాయకుడు రంగు రమేష్ అన్నారు. మండలంలోని చిన్న పెండ్యాల, శ్రీపతిపల్లి గ్రామాల్లో వారి వారి తోబుట్టువులతో కలిసి రాఖీ కట్టించుకున్నారు. అనంతరం వారికి ఆశీర్వచనం అందజేశారు. అలాగే గ్రామాల్లో రాఖీ పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో మాజీ సర్పంచులు కర్ణకంటి స్వప్న-వెంకటేశ్, ఏదునూరి రవీందర్, లోడెం రజిత-రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

● నర్మెట: మండలంలో రక్షాబంధన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. మహిళలు ఉదయం నుంచే దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆడపడుచుల రాకతో గ్రామాలు కళకళలాడాయి. గ్రామాల్లోని దేవాలయాల్లో గ్రామస్థులు ప్రత్యేక పూజలు చేశారు. ఆడపడచులు తమ సోదరులకు రాఖీలు కట్టారు. సోదరుల కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. పద్మశాలీలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

● పాలకుర్తి: సోదరీమణులు, సోదరుల మధ్య ప్రేమానురాగాలకు ప్రతీక రాఖీ పండుగను మండలంలో ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లో ఇంటింటా రాఖీ పండుగ సందడి నెలకొంది. సుదూర ప్రాంతాల నుంచి సోదరీమణులు తమ పుట్టిళ్లకు వచ్చి అన్నదమ్ములకు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు. బట్టల దుకాణాలు, స్వీట్ షాపులు, పండ్ల దుకాణాలుకొనుగోలుదారులతో కిక్కిరిసిపోయాయి.

● రఘునాథపల్లి: మండలంలో రాఖీ పండుగను ఘనంగా జరుపుకున్నారు. మెట్టినింటి నుంచి పుట్టింటికి వచ్చిన ఆడపడుచులతో పల్లెలు కళకళలాడాయి. అక్కాచెల్లెళ్లు.. తమ అన్నదమ్ములకు ప్రేమానురాగాలతో రాఖీలు కట్టి స్వీట్లు తినిపించడంతో గ్రామాల్లో పండుగ సందడి నెలకొంది. ఆలయాలు భక్తుల సందడితో కిటకిటలాడాయి.

● కొడకండ్ల: మండల వ్యాప్తంగా హిందువులు రాఖీ పండుగను సంప్రదాయబద్ధంగా ఘనంగా జరుపుకున్నారు. తమ్ముళ్లకు అక్కలు, అన్నలకు చెల్లెళ్లు రక్షబంధనాలు కట్టి నీకు నేను, నాకు నీవు అనుకుని వారి మధ్య అనుబంధానికి ప్రతీకలుగా నిలిచారు. మండల కేంద్రంలోని దేవాలయాలు భక్తులతో నిండిపోయాయి. యజ్ఞోపవీతాలు ధరించే సంప్రదాయం ఉన్నవారు శ్రావణ మాసంలో వచ్చే పౌర్ణమి రోజున శాస్త్రోక్తంగా కొత్త యజ్ఞోపవీతాలు ధరించారు. కొడకండ్లలోని మార్కండేయ భవన్‌లో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సామూహికంగా నూతన యజ్ఞోపవీతాలు ధరించారు.

● జఫర్‌గడ్: మండల ప్రజలు రాఖీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ప్రతీ ఏటా శ్రావణ మాసంలో వచ్చే రాఖీ పండుగ సందర్భంగా ఆడపడుచులు తమ సోదరులకు ఆప్యాయంగా రాఖీలు కట్టి, స్వీట్లు తినిపించి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. నీకు నేను రక్ష.. నాకు నీవు రక్ష .. అంటూ రక్షాబంధన్‌తో అనుబంధాలను గుర్తు చేసుకున్నారు. ఆడపడుచులు, ఆత్మీయులు, కుటుంబ సభ్యులచే పల్లెల్లో సందడి కనిపించింది.


మాజీ ఎమ్మెల్యే రాజయ్యకు రాఖీ కడుతున్న సోదరీమణులు


పాలకుర్తిలో సోదరుడికి రాఖీ కడుతున్న అక్కలు


స్టేషన్‌ఘన్‌పూర్‌లో సోదరునికి రాఖీ కడుతున్న అక్కలు


చిలుపూరులో తోబుట్టువులతో కలిసి వేడుకలు జరుపుకుంటున్న జనగామ యాదగిరి


కొడకండ్లలో నూతన జంధ్యం ధరిస్తున్న పద్మశాలీ కులస్తులు


నర్మెటలో సోదరులకు రాఖీలు కడుతున్న అక్కాచెల్లెళ్లు

నేడు శాస్త్రవేత్తలతో రైతు నేస్తం

జఫర్‌గడ్, ఆగస్టు 19: మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో మంగళవారం వ్యవసాయ శాస్త్రవేత్తలచే రైతు నేస్తం కార్యక్రమం ఉంటుందని మండల వ్యవసాయ విస్తరణాధికారులు సోమవారం తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రస్తుత సీజన్‌లో వరి పంట సాగు, చీడపీడల యాజమాన్యం, తదితర అంశాలపై వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు వివరిస్తారన్నారు. వివిధ పంటల సాగుపై సలహాలు, సూచనలు చేస్తారని పేర్కొన్నారు. మండలంలోని ఆయా గ్రామాల రైతులు ఉదయం 10 గంటలకు రైతు నేస్తం కార్యక్రమానికి హాజరు కావాలని వారు కోరారు.

గోదావరి జలాలతో చెరువులను నింపాలి

జనగామ రూరల్, ఆగస్టు 19: జిల్లాలోని చెరువులను గోదావరి జలాలతో నింపాలని జాతీయ మానవ హక్కుల కమిటీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి యాసారపు కరుణాకర్ కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఏవో రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ వర్షాలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని కోరారు.

సీఐని కలిసిన పద్మశాలీ సంఘం నేతలు


సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ నరేష్‌ను సన్మానించిన పద్మశాలీ సంఘం నాయకులు

రఘునాథపల్లి, ఆగస్టు 19: మండల పద్మశాలీ సంఘం నాయకులు రఘునాథపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డిని సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సీఐతో పాటు ఎస్ఐ డి.నరేష్‌ను పద్మశాలీ సంఘం నాయకులు శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజలు మధ్యవర్తులను ఆశ్రయించకుండా నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు. తగాదాలకు తావివ్వకుండా ప్రజలు స్నేహభావంతో ఉండాలని కోరారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం రాష్ట్ర నాయకుడు రాపోలు రామ్మూర్తి, వల్లాల అశోక్, చింతకింది కృష్ణమూర్తి, రాపోలు పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన బైక్

ఒకరి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు


పసుల నరేష్ (ఫైల్), గాయపడిన ఏసును ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 19: బైక్‌పై రాంగ్ రూట్‌లో వెళ్తూ ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ప్రమాదవశాత్తు ఢీకొట్టడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని మీదికొండ క్రాస్‌రోడ్డు వద్ద జాతీయ రహదారిపై సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం... మండలంలోని మీదికొండ గ్రామానికి చెందిన పసుల నరేష్ (26) అనే యువకుడు తాపీమేస్త్రీగా పని చేస్తున్నాడు. రాఘవపూర్‌లో ఒకరు డబ్బులు ఇవ్వాల్సి ఉండగా మీదికొండకు చెందిన మరో మేస్త్రీ కొత్తూరు ఏసుతో కలిసి సోమవారం బైక్‌పై బయలుదేరారు. నరేష్ బైక్ నడుపుతుండగా ఏసు వెనుకాల కూర్చున్నాడు. ఈక్రమంలో మీదికొండ క్రాస్‌రోడ్డు నుంచి రాంగ్‌రూట్‌లో రాఘవపూర్‌కు వెళ్తున్నాడు. జాతీయ రహదారిపై అదేసమయంలో హైదరాబాద్ నుంచి హనుమకొండ వైపు వస్తున్న ఆర్టీసీ బస్సును బైక్ ఢీకొట్టింది. దీంతో నరేష్, ఏసు రోడ్డు అవతల ఎగిరిపడ్డారు. ఈ ప్రమాదంలో నరేష్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందగా, ఏసుకు తీవ్రగాయాలై కాలు విరిగింది. తీవ్రంగా గాయపడిన ఏసును చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. కాగా, నరేష్ తండ్రి కిష్టయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వేణు తెలిపారు.

మోటారు సైకిల్‌ను ఢీకొట్టిన కారు

ఒకరికి గాయాలు

ప్రథమ చికిత్స చేసిన ఎంపీ డాక్టర్ కావ్య

రఘునాథపల్లి, ఆగస్టు 19 : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి ప్రథమ చికిత్స అందించి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సంఘటన వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారిపై మండలంలోని నిడిగొండ బ్రిడ్జి సమీపంలో యూటర్న్ వద్ద సోమవారం రాత్రి చోటుచేసుకుంది. నిడిగొండ గ్రామానికి చెందిన బిర్రు అనిల్‌కుమార్ మోటారు సైకిల్‌పై ఇంటికి వెళ్తున్న క్రమంలో యూటర్న్ వద్ద జనగామ నుంచి హనుమకొండకు వెళ్తున్న కారు ఢీకొట్టి వెళ్లిపోయింది. గాయపడిన అనిల్‌కుమార్ రోడ్డుపై పడిపోయి ఇబ్బంది పడుతున్నాడు. అదే సమయంలో హైదరాబాద్ నుంచి హనుమకొండకు వెళ్తున్న వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అనిల్‌కుమార్‌ను చూసి తక్షణమే స్పందించారు. కారు ఆపి దిగి గాయాలతో బాధపడుతున్న అతడికి కడియం కావ్య వైద్యురాలు కావడంతో ప్రథమ చికిత్స అందించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ డి.నరేష్ అంబులెన్స్ ద్వారా అనిల్‌కుమార్‌ను జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్థులు ఎంపీ కావ్యకు కృతజ్ఞతలు తెలిపారు.


అనిల్‌కుమార్‌కు ప్రథమ చికిత్స చేస్తున్న ఎంపీ కడియం కావ్య

కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర జాయింట్ కన్వీనర్‌గా సిద్దులు

జనగామ రూరల్, ఆగస్టు 19: కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర జాయింట్ కన్వీనర్‌గా మిద్దెపాక సిద్దులు నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం అధ్యక్షుడు నగరిగారి ప్రీతమ్ ఉత్తర్వులు జారీ చేయగా జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా సిద్దులు మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు లింగాల నర్సిరెడ్డి, శివరాజ్ యాదవ్, మెర్గు బాలరాజు, మల్లేశ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయాలి

చిలుపూర్, ఆగస్టు 19: రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతుసంఘం ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి సాదం రమేష్ పిలుపునిచ్చారు. మండలంలోని కృష్ణాజీగూడెంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయం 11 గంటలకు చేపట్టే ధర్నాకు బాధిత రైతులు హాజరు కావాలని రమేష్ కోరారు. సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

విద్యా పురోగతికి న్యాస్

(5వ పేజీ తరువాయి)

చేస్తోంది. గతంలో 2017, 2021లో నిర్వహించగా ఈసారి కూడా నవంబరులో న్యాస్-2024 నిర్వహించేందుకు ఎస్‌సీఆర్‌టీ కసరత్తు చేస్తోంది. విద్యార్థుల సామర్థ్యాలు పెంచడమే లక్ష్యంగా గతంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు 'తొలిమెట్టు', ఉన్నత పాఠశాలలకు 'ఉన్నతి' వంటి కార్యక్రమాలు అమలు చేశారు. విద్యార్థుల సామర్థ్యాలు తెలుసుకునేందుకు 3, 6, 9 తరగతుల వారికి ఈ పరీక్ష నిర్వహిస్తున్నారు. ఇందుకోసం పిల్లలను, విద్యార్థులను సిద్ధం చేస్తున్నారు.

ఫలితాల ఆధారంగా..

న్యాస్ ఫలితాల ఆధారంగా విద్య మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం నిధులు కేటాయిస్తుంది. దీంతో ఈ పరీక్షలపై అవగాహన పెంచి తరగతులు, సబ్జెక్టుల వారీగా మెటీరియల్ అందించి ఫలితాలు సాధించేలా కృషి చేయనున్నారు. ఫలితాల సాధన కోసం జిల్లా విద్యాశాఖ పూర్తి స్థాయిలో ప్రయత్నాలు చేస్తోంది. శిక్షణను ఉపాధ్యాయులు చక్కగా వినియోగించుకునేలా తయారు చేస్తోంది. ప్రభుత్వం న్యాస్-2021 సర్వే డేటా ఆధారంగా విద్యార్థుల అభ్యసన స్థాయిలను మెరుగుపరచడానికి దీర్ఘకాలిక, మధ్యకాలిక, స్వల్పకాలిక ప్రణాళికలు రూపొందించి అమలు చేసింది. గత విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ, లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాంల ద్వారా విద్యార్థుల విద్యా సామర్థ్యాలు పెంచడానికి ప్రయత్నం జరుగుతుంది.

ఉపాధ్యాయులకు శిక్షణ ఇలా..

జాతీయ వ్యాప్తంగా ప్రస్తుతం 3వ, 6వ, 9వ తరగతి చదువుతున్న విద్యార్థుల ప్రగతిని మదింపు చేయడానికి న్యాస్-2024ను నవంబరు నెల చివరి వారంలో నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది. అందుకనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా విద్యార్థులను సన్నద్ధం చేయడానికి ప్రణాళికలు రూపొందించింది. నిన్నటి వరకు న్యాస్‌లో వచ్చే ప్రశ్నల సరళి, తరగతి వారి సబ్జెక్టు, వారి విద్యా సామర్థ్యాలు, విద్యార్థుల్లో సాధించాల్సిన అభ్యసన ఫలితాలు, న్యాస్ ప్రశ్నపత్రంపై ప్రతి సబ్జెక్టు ఉపాధ్యాయునికి జిల్లా, మండల స్థాయిలో కాంప్లెక్స్ సమావేశాల్లోనే శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి సంపూర్ణ అవగాహన పర్చారు. ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి న్యాస్‌లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ప్రధానోపాధ్యాయులతో జరిపిన జూమ్ మీటింగ్‌లో సూచించారు.

ఆలయాల్లో శ్రావణ సందడి

నేడు మంగళగౌరీ వ్రతాలు

జఫర్‌గడ్, ఆగస్టు 19: ఆలయాల్లో శ్రావణ సందడి నెలకొంది. సోమవారం శ్రావణ పౌర్ణిమ అనగా రాఖీ పౌర్ణిమను పురస్కరించుకుని మండలకేంద్రంలోని ఉమానీలకంఠ మహేశ్వరస్వామి, శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయాలతో పాటు వివిధ గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు, మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు భక్తిశ్రద్ధలతో పూజలు, అభిషేకాలు చేశారు. ఉపవాస దీక్షలు చేశారు. పిల్లాపాపలతో సుఖశాంతులతో విలసిల్లేలా దీవించండి..అంటూ వేడుకున్నారు. కాగా, శ్రావణ మాసంలోని మూడు వారాలు అత్యంత పుణ్యప్రదమైనవని పండితులు చెబుతున్నారు. మంగళ, శుక్ర, శనివారాలు.. ఈ మాసంలో అత్యంత ప్రధానమైనవి. ఈ మాసంలోని మంగళవారాలు శ్రీగౌరీ పూజకు, శుక్రవారాలు లక్ష్మీపూజలు, శనివారాలు శ్రీమహావిష్ణువు పూజకు ముఖ్యమైన రోజులు.

శ్రావణం అందరికీ శుభకరం. ఈ మాసంలో అన్ని మంగళవారాల్లో చేసే వ్రతమే మంగళగౌరీ వ్రతం. ఈ వ్రతాన్ని కొత్తగా వివాహమైన మహిళలు ఆచరించాలి. ఐదేళ్ల పాటు మంగళగౌరీ వ్రతాన్ని ఆచరించి ఉద్యాపన చేయాలి. దీంతో సుమంగళిగా ఉండడమే కాకుండా వారి కుటుంబంలో సుఖశాంతులు, అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని విశ్వాసం. ఇందుదృష్ట్యా ఈ రోజున నూతనంగా పెళ్లయిన అతివలు అమ్మవారికి మంగళగౌరీ నోములు ఆచరించేందుకు సిద్ధమయ్యారు.

వైభవంగా నూలుపోగు పండుగ


పాలకుర్తిలోని పంచగుళ్లలో పూజలు చేస్తున్న చేనేత కార్మికులు

పాలకుర్తి, ఆగస్టు 19: మండలకేంద్రంలోని పంచగుళ్లలో జంజిరాల పౌర్ణమి (నూలుపోగు పండుగ)ని పద్మశాలీ కులస్తులు సోమవారం వైభవంగా నిర్వహించారు. రాజీవ్ చౌరస్తా నుంచి పంచగుళ్ల వరకు ర్యాలీ నిర్వహించారు. గ్రామానికి చెందిన ఆ కుల పెద్ద పెనుగొండ రమేష్ ఇంటివద్ద నుంచి పంచగుళ్ల వరకు బ్యాండ్ మేళాలతో స్వామి వారికి పట్టు వస్త్రాలను తీసుకెళ్లారు. మార్కండేయ ఆలయ అర్చకుడు గంగు రఘు, శర్మ నేతృత్వంలో స్వామి వారికి పట్టు వస్త్రాలను అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కొత్తపల్లి వెంకటయ్య, చిలుకమారి వెంకటేశ్వర్లు, చిదిరాల ఎల్లయ్య, మార్కండేయ, కూరపాటి సుదర్శన్, సోమేశ్వర్, మేడారపు సుధాకర్, గజ్జెల్లి వెంకన్న, పుండరీకుడు, చిదురాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి నేలకూలిన డీటీఆర్, చెట్లు


మండల కేంద్రంలో భారీ వర్షానికి నేలకూలిన ట్రాన్స్‌ఫార్మర్

లింగాలఘనపురం, ఆగస్టు 19 : లింగాలఘనపురం మండలంలో సోమవారం సాయంత్రం భారీ ఈదురు గాలులతో కూడిన వర్షానికి విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ప్రధానంగా మండల కేంద్రంలో సుమారు గంటపాటు కురిసిన వర్షానికి ఎస్ఎస్ 82 డీటీఆర్ నేలకూలడంతో భారీ ప్రమాదం తప్పింది. దీంతో గ్రామంలో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. అదేవిధంగా వడ్డిచర్లలో జనగామ-సూర్యాపేట రహదారి పక్కన ఉన్న ఓ చెట్టు గాలిదుమారానికి విరిగి విద్యుత్ లైన్లపై పడిపోయింది. దీంతో ఒక్కసారిగా భారీ శబ్దంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఈ సమాచారం అందుకున్న ఏడీఈ అనిల్‌కుమార్, లైన్ ఇన్‌స్పెక్టర్ నర్సింహస్వామి వెంటనే రంగంలోకి దిగి జేసీబీ సహాయంతో కూలిన చెట్లను తొలగించే పనిచేబట్టారు. రాత్రి పొద్దుపోయే వరకు కూడా కరెంట్ రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.